కథానిక

# పరాభవాగ్ని

రంధి సోమరాజు

తాలూకాఫీసంతా ఒకటే హడావుడిగా ఉంది.

వెళ్ళిపోతూన్న తహసీల్దారుగారికి వీడ్కోలివ్వడానికి, వస్తూన్న తహసీల్దారుగారికి స్వాగత పత్రాలందజేయడానికీ గుమాస్తాలందరూ తెగ నలిగిపోతున్నారు. చందాలు పోగెయ్యడానికి పూనుకున్న సుబ్బారావు ఎవరెవరెంతెంత ఇవ్వాలో ఓ పట్టిక తయారుచేసి, ఇవ్వబోయే 'టీ' పార్టీలో ఉండే పదార్థాల జాబితా కూడా తయారు చేశాడు. రెండు స్వీట్లు, ఒక కారం, ఒక చక్కెర కేళీ, కాఫీ, సిగరెట్లు, కిళ్ళీ... ఆమీదట ఫోటో— అంతా బాగుందంటే బాగుందన్నారు. చందాలు కూడా వెంటనే వసూలైపోయాయి. వెంటనే ఇవ్వలేనివాళ్ళు జీతాలనాడు చెల్లించుకుంటామని సవినయంగా మనవిచేసుకున్నారు. సుబ్బారావు 'అలాగే' అన్నాడు. తృప్తిగా తలపెట్టిన కార్యం అంతా సక్రమంగా జరిగిపోతూన్నట్లు ఊహించుకొని శివరావుదగ్గర కొచ్చి, 'ఏం భాయీ... నువ్వు తప్పక వ్రాయాలి. ఊహూ అంటే కుదరదు. ఏవో నాలుగు ముక్కలు, ఇంద్రుడు, చంద్రుడు అనక్కర్లేదులే' అంటూ ముందుకు సాగిపోయాడు.

వెంటనే శివరావు అతన్ని వెనక్కి పిలిచి, "వీడి గురించి అంటే ఎలాగో ఓలాగ ఏడుస్తాననుకో... మరి ఆ వచ్చేవాడి సంగతి? మరి వాడి సంగతి నాకేం తెలియదే, అయినా నాకు వ్రాయ బుద్ధేయడం లేదు బ్రదర్. అదేదో ఎలా నోటికొస్తే అలా నువ్వే వాగేద్దూ" అన్నాడు.

సుబ్బారావు పూర్తిగా నిరుత్సాహ పడిపోయినట్లు దిగాలుగా ఓ క్షణం మొగంపెట్టి, అంతలోనే భారంగా నవ్వును తోడుకొని, "అలాగంటే ఎలా భాయ్! వాడి హిస్టరీ నేను కనుక్కుంటాగా ఓ క్షణంలో వస్తాను. ఈలోగా నువ్వు మనవాడి సంగతి కానియ్" అంటూ ముందుకు సాగిపోయాడు.

శివరావుకు కలం నడవడం లేదు. ఏమి వ్రాయాలో తోచడంలేదు. ఈ రెండేళ్ళనుంచీ ఈ తహసీల్దారుగారి దగ్గర ఉండి గ్రహించిన విషయాల నన్నిటినీ గుర్తుకు తెచ్చుకున్నాడు. డబ్బు ముందు తప్పించి అతను ఎప్పుడూ మంచివాడుగా లేడన్న విషయం అతని కళ్ళముందు నిలిచి పగలబడి నవ్వింది. ఇంటిదగ్గర అతను తన పెళ్ళాం ముందు ఉన్నంత మంచిగా ఆఫీసులో ఎప్పుడూ లేడు. కనీసం అందులో వెయ్యోవంతు ప్రదర్శించగలిగినా బాగుండును. వాళ్ళమీదా వీళ్ళమీదా చాడీలు చెప్పేవాళ్ళను చేరదీసేవాడు. ఎప్పుడూ ఎవ్వరికో ఒకరికి హాని చెయ్యందే నిద్రపోయేవాడు కాదు. మళ్ళీ చిన్నకొడుకు కాలిబూటుకు చిన్న రాయి తగిలితే మునిసిపాలిటీ వాళ్ళను తెగ తిట్టిపోసేవాడు. ఇలాంటివాడిని గురించి ఏమి వ్రాయడం? పీక విరగడౌతూందని వ్రాయడమే మరి సబబైన పని! కాని అలా వ్రాయకూడదు. అబ్బ! కాగితంమీద అతనికిలేని గుణాలు ఎక్కించడం ఎంత నీచం! రాజుల కాలంనాటి పొగడ్తలన్నీ ఇలాగే తయారయ్యాయి. ఇప్పుడు కూడా అదే సాగుతోంది. పాపం ఆ నిజం, తనమీద పేరుకపోయిన ఈ అబద్ధాల అట్టడుగున కుళ్ళికుళ్ళి ఏడుస్తుంది. ఆ ఏడుపు ఎప్పుడో ఎక్కడికో వినిపిస్తుంది. కాని అప్పటికి ఆ కాలం ఉండదు. ఏమి లాభం? అంతే... అంతే... అబద్ధాలకే లాభం... అన్యాయాలకే విజయం" అనుకుంటూ శివరావు ఏమిటేమిటో ఊహిస్తూండగా, సుబ్బారావు ఉషారుగా వచ్చి, "ఏమి భాయీ వ్రాసేశావా? అబ్బో... ఈ మన కొత్త తహసీల్దారు చాలా అఖండుడటోయ్. వాడిది చాలా బ్రాడ్ బ్రైనట, పనిలో కాస్త కూడా జాగు సహించడట. అంతా క్విక్. చాలా సహృదయుడని చెప్పారు. అతనికన్నా అతని భార్య

ఇంకా ఎంతో మంచిదట. ఆమె మాట అతను కించిత్తూ జవదాటడట. అయినా ఈ సంగతి మన కనవసరం అనుకో. నీకు ఉపయోగపడుతుందని వాడి ఇంటిపేరు కూడా రాబట్టాను. బలేగా ఉందిలే ఆ యింటిపేరు. 'చంద్రవంక' అట. పేరు సూర్య నారాయణమూర్తి. బాగుంది కదూ! సంతకం మాత్రం సి. హెచ్. ఎస్. మూర్తి అని పెడతాడట. ఇక నీ కవిత్వాన్నంతా గుమ్మగా ప్రదర్శించాలి" అంటూ తిన్నగా శివరావు మొగంలోకి సిగరెట్టు పొగలాగ ఉఫ్‌న నవ్వును వెదజల్లాడు. కాని శివరావు నవ్వలేదు. ఆ సమయంలో అతని మొగంలో క్రోధం, కర్కశత్వం, రాక్షసత్వం, భయంకరంగా బుసలు కొడుతున్నాయి. అతని కళ్ళల్లో బడబాగ్ని జ్వాలలు వెదజల్లబడుతున్నాయి. సుబ్బారావు శివరావును చూసి ఆశ్చర్యపోయాడు. శివరావు మిత్రుడితో ఏమీ మాట్లాడలేదు. 'వ్రాయను' అనలేదు. 'వ్రాస్తాను' అనలేదు. అతను సూటిగా సుబ్బారావు మొగంలోకి చూశాడు. అక్కడ అతనికి సుబ్బారావు మొగం కనిపించలేదు. తహసీల్దారు చంద్రవంక సూర్యనారాయణమూర్తి కనిపించాడు. 'అతనా కాదా' అతని గుండె స్పందించింది. వెంటనే అతను సైకి లెక్కి ఇంటికి తుణాలమీద చేరుకున్నాడు. సుబ్బారావు శివరావువైపు అలాగే చూస్తూ, "ఏమయింది తనకి, పిచ్చెక్కలేదు కదా" అను కుంటూ అక్కడే అలాగే నిలబడిపోయాడు.

ఇంటికి వచ్చీరాగానే శివరావు ఇంట్లోవున్న ఫోటోవైపు తీక్ష్ణంగా చూశాడు. ఆ ఫోటోలో శివరావు అక్క సుగుణ కుర్చీలో కూర్చున్న సూర్యనారాయణమూర్తి ప్రక్క నిలబడి ఉంది. శివరావుకు ఆ ఫోటోను ఎప్పుడో ముక్కలు ముక్కలు చేయాలనిపించింది. కాని అందులో స్వర్గస్తురాలైన అక్క ఉండిపోయింది. 'అక్కా నిన్ను నేను చూడటానికి నోచుకోలేకపోయాను. పాపిష్టివాణ్ణి. కాని...కాని... ఈ రోజున నాన్నను హత్య చేసిన ఆ దుర్మార్గుణ్ణి చూడబోతున్నా నక్కా...నిజంగా అతన్నేమి చేసినా పాపంలేదు. చెప్పు అక్కా...న్యాయంగా చెప్పు... ఆ దుర్మార్గుణ్ణి, ఆ నీచుణ్ణి ఏమిచేసి పగతీర్చుకోమంటావు?' అంటూ దదేక దృష్టితో ఆ ఫోటోలో ఉన్న అక్కవైపు చూశాడు. ఆ తరవాత సూర్యనారాయణమూర్తివైపు కర్కశంగా చూశాడు. 'ఈ మొగం ఇక మరచిపోను' అనుకుంటూ వెంటనే తిన్నగా ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

సరిగా మూడింటికి కొత్త తహసీల్దారు చంద్రవంక సూర్యనారాయణమూర్తి ఆఫీసులో కాలు పెట్టాడు. ప్రస్తుతం ఉన్న తహసీల్దారుగారి గది లోకి వెళ్ళాడు. సుబ్బారావు వెంటనే వారిద్దరినీ టీపార్టీ జరిగే గదిలోనికి ఆహ్వానించాడు. ఏదో మాట్లాడుదామనుకున్నాడు కాని ఆ పని చాతకాక ఫలహారాలు వడ్డింపించడంలో మునిగిపోయాడు.

శివరావు తిన్నగా క్రొత్త తహసీల్దారువైపు ఎర్రని కళ్ళతో కుతకుత ఉడికిపోతూన్న గుండెతో తీక్ష్ణంగా చూశాడు.

పాత తహసీల్దారు కొత్తగా వచ్చిన తహసీల్దారుగారికి ఒక్కొక్క గుమాస్తాను పరిచయం చేశాడు. శివరావును పరిచయం చేస్తూ, 'ఇతనికి షార్ట్‌హాండ్ వచ్చండోయ్...టైపు దంచేస్తాడు' అని నవ్వాడు.

వెంటనే క్రొత్త తహసీల్దారు, 'ఇతనికి షార్ట్ హేండ్ వచ్చో రాదో కాని, ఇతని మొగం మాత్రం ఓ షార్ట్ స్టోరీలా ఉంది. ఏమోయ్... ఏమిటి కథ...' అంటూ ముందుకు సాగిపోయాడు. గుమాస్తాలందరూ ఒక్కసారి గొల్లుమన్నారు. శివరావు ఉడుకుఱుంవునా కాలిపోయాడు. 'హంత కుడు హాస్యమాడుతున్నాడు. వీడికి రోజులు దగ్గరపడ్డాయి...' అనుకున్నాడు.

* * *

పాపం శివరావు తండ్రి సుబ్బయ్య ఇక పిల్లలు పుట్టరన్న తలంపుతో ఉన్న ఆస్తినంతా కట్నంగా ఇచ్చి సూర్యనారాయణమూర్తిని అల్లుడుగా తెచ్చుకున్నాడు. పిల్ల పేరిట ఇవ్వదలచిన ఆస్తినంతా వ్రాసి ఇస్తేగాని పెళ్ళి జరగటానికి వీల్లేదని సూర్యనారాయణమూర్తి తండ్రి పట్టుపట్టాడు. పాపం పిచ్చి సుబ్బయ్య ఎలాగో ఓలాగ కాలం వెళ్ళిపోక పోతుందా అనుకొని ఎకరన్నర ఉంచుకొని కూతురు సుగుణ పెళ్ళి దివ్యంగా జరిపించాడు. ఊళ్ళో పెద్దలు ముక్కుమీద వేలేసుకున్నారు. 'ఎంత ఒక్కగాని ఒక్కకూతురైనా ఈపని బాగు లేదు సుబ్బయ్యా!' అని వాళ్ళకని కొంతో

చెప్పారు. కాని అతను వినలేదు. 'పోనీలెండి... నా కూతురుకన్నా నా నేను' అంటూ సుబ్బయ్య ఆ వియ్యంకుడి అభీష్టాన్ని నెరవేర్చి కూతుర్ని అత్తవారింటికి సాగనంపాడు. కాని కూతురు అత్తవారింటికి వెళ్ళి ఎంతో కాలం అవనే లేదు, భార్య పెరట్లో డోక్కోవడం చూశాడు. అతని కళ్ళు తిరిగాయి. మూర్ఛబోయాడు. 'అయ్యో ఈ పుట్టబోయేది ఆడపిల్ల అయితే ఇక నేనేం చేయగలను...ఇక నేనేం చేయగలను...అని గట్టిగా విలపించాడు. కాని అతని అదృష్టవశాత్తూ కొడుకే పుట్టాడు. అయినా సుబ్బయ్య మనసు మనసులో వుండేది కాదు. ఈ కొడుక్కి ఏదో అన్యాయం చేసినట్లు రోజూ రాత్రిళ్ళు దుఃఖించేవాడు. ఊళ్ళో పెద్దమనుష్యులు, 'ఆ నాడు మా మాట విన్నావు కాదు...' అంటూంటే తలవంచుకున్నాడు. నలిగిపోయిన వాడిలా పొద్దుట ఎక్కడికో పోయి సాయంకాలానికిగాని ఇంటికి చేరుకునేవాడు కాదు.

ఈ విధంగా తండ్రి పడుతూన్న బాధనంతా సుగుణ అర్థం చేసుకుంది. కాని ఏమి చేయగలదు? తన ప్రాణం తన చేతుల్లో లేదు. తండ్రి దుఃఖాన్ని తీర్చే శక్తి తనలో లేదు. పాపం తల్లిదగ్గర భోరున ఏడ్చింది. తండ్రి కూతుర్ని చూసి కాస్త స్థిమితపడ్డాడు. సుగుణ తమ్ముడి చదువుకు సహాయపడుతుంది. ఫరవాలేదు...అనుకున్నాడు. కాని అంతలోనే అమాయిక అయిన తన కూతురు ఇంత సాహసం చేయలేదని అతను నిబ్బరం కోల్పోయాడు. 'అత్తగారు, ఆడబడుచులు, పుల్లల్లా తిరిగే ఆ యింట్లో అమ్మాయి బ్రతుకే చితుకు చితుకు మంటూంటే ఇంక సహాయం ఏం చేస్తుంది' అని దిగులుపడి పోయాడు.

పాపం సుగుణ ఆ నాటినుంచీ అత్తవారింటి దగ్గర సుఖంగా ఉండలేకపోయింది. ఆమె దృష్టి అంతా తమ్ముడివైపు, తండ్రివైపు మరలిపోయేది. పిచ్చిగా కిటికీనుంచి ఆకసాన్ని చూస్తూ నిలబడి పోయేది. భర్తకు పరాకుగా జవాబిచ్చేది. భోజనం సరిగా చేసేది కాదు. ఒకరోజున మేడమెట్లమీంచి తూలి క్రిందపడిపోయింది. ఆ గాయాలు మానేటప్పటికి నెలరోజులు పట్టింది. ఆ తరువాత ఆమె సరిగా కోలుకోలేక పోయిందనే చెప్పాలి. ఇంతలో టైఫాయిడ్ అన్నారు. ఒక రోజున సుబ్బయ్య వణికే చేతులతో టెలిగ్రాం అందుకున్నాడు. పాపం ఆ చిన్నది తల్లినీ, తండ్రినీ చిట్టి తమ్ముణ్ణీ చూడకుండానే ఈ లోకాన్ని విడిచిపెట్టిపోయింది.

సుబ్బయ్య భోరున ఏడ్చాడు. 'తల్లీ మమ్మల్ని అన్యాయం పాలుచేసి పోయావా అమ్మా...నీ సుఖం దేవుడు కూడా చూడలేకపోయాడా తల్లీ' అంటూ గుండెలు పగిలిపోయేట్టు ఏడ్చాడు. ఆ ప్రక్కింటి వాళ్ళెవ్వరో చనిపోయేముందు ఆ పిల్ల పడిన యాతన వర్ణించి చెప్తూంటే నేలను వేసి తల బాదుకున్నాడు.

'నేను చనిపోతే మా నాన్నగారిచ్చిన కట్నం, మా నాన్నగారికిచ్చేస్తారు కదూ...నాకు పిల్లలు లేనప్పుడు, మనలో అది ఇచ్చేసే ఆచారం ఉంది కదూ...అన్నాదండి' అని వాళ్లు చెప్తూంటే సుబ్బయ్య గుండెలు బాదుకున్నాడు. 'అమ్మా...తల్లీ...'అంటూ మెలికలు తిరిగిపోయాడు. 'నువ్వు మనుష్యుల్లో తప్ప బుట్టావు తల్లీ...ఇంత అంతస్తు నీ కెక్కడనుంచి వచ్చిందే...అయ్యో...తమ్ముణ్ణి నేను పెంచలేనూ...' అంటూ ఏడ్చి ఏడ్చి సొమ్మసిలిపోయాడు. 'నారాయణ...నారాయణ...' అంటూ ఆమెను తీసుకపోతూంటే ఏమీ తెలియని కొడుకుతో, 'బాబూ...అక్క వెళ్ళిపోతోంది నాయనా...'అక్కకు దండం పెట్టు బాబూ...అక్క దేవత బాబూ...' అని ఆ పసివాడి బుల్లి చేతులు ఎత్తి సుగుణకు నమస్కారం పెట్టిస్తూంటే అక్కడ ఉన్న వాళ్ళంతా కళ్ళనీళ్లు పెట్టుకున్నారు.

పాపం అప్పటినుంచీ సుబ్బయ్య పూర్తిగా మారిపోయాడు. ఓ రోజున ఊళ్ళోని మునసబు, 'ఏవయ్యా...వాళ్ళదగ్గరనుంచి, కట్నంగా ఇచ్చిన సొమ్ము ఇంకా రాబట్టలేదేం. ఎందుకింకా ఆలస్యం చేస్తావ్...' అన్నాడు. పాపం సుబ్బయ్య కళ్ళల్లో నీళ్లు నిండుకున్నాయి. 'ఆ సొమ్ముతో మా సుగుణమ్మను తెచ్చుకోగలనా బాబూ...' అన్నాడు. వెంటనే ఆ మునసబు 'అయ్యో పిచ్చోడా...ఇలా అయితే ఎలా బ్రతుకుతావయ్యా...పద నేనూ వస్తాను...' అని పాపమాయన ఆ కష్టంమీద సుబ్బయ్యను విజయనగరంలో ఉన్న వాళ్ళ వియ్యంకుడి ఇంటికి బయలుదేర తీశాడు.

సుబ్బయ్య మునసబుగారితో అక్కడకు వెళ్ళేడన్న మాటేగాని పాపమతని మనసు మనసులో లేదు. పెద్దమనిషిని తీసుకెళ్తున్నాను, వాళ్లు గౌరవిస్తారో గౌరవించరో అని హడలిపోయాడు. పాపమతను అనుమానించినట్లుగానే ఆ అమర్యాదస్తులు వీళ్ళను పరాయి వాళ్ళను గౌరవించినట్లయినా గౌరవించలేదు. అల్లుడు సూర్యనారాయణమూర్తి మామగార్ని చూడనట్లే ఇంట్లోకి వెళ్ళిపోయాడు. అప్పుడే వియ్యంకుడు అరుగుమీదికి వచ్చి, 'ఏంపనిమీద వచ్చారు?' అన్నాడు. మునసబుకు అతని ముక్కుమీద గ్రుద్దాలనిపించింది. వచ్చిన వాళ్ళను కూర్చోమని కూడా అనకుండా ఎలా మాట్లాడుతున్నాడు అని భగభగ మండిపోయాడు. కాని ఇప్పుడు శాంతం వహించడం అవసరం అని మనసులో నిర్ణయించుకున్నాడు. సుబ్బయ్య వైపుచూస్తే పాపమతను ఈ లోకంలో ఉన్నట్టేలేడు. అక్కడ ఓ బల్ల ఉంటే దానిమీద చతికిలబడి...ఆయన సుబ్బయ్యగారి వియ్యంకుడికి అంతా సవిస్తరంగా చెప్పాడు. ఇది న్యాయం అన్నాడు. సుగుణకు పిల్లలుంటే ఆ కట్నం మీ సొత్తే అవుతుంది. కాని పిల్లలు లేనప్పుడు మనలో అనవాయితీగా వస్తూన్న ధర్మం ప్రకారం మీరు పుచ్చుకున్న కట్నం తిరిగి ఇచ్చివేయడం న్యాయం' అన్నాడు. కాని అతను ఇవేమీ వినిపించుకోలేదు. 'మీ న్యాయన్యాయాలు నాకేమీ తెలియవు. కోర్టులో న్యాయమని చెప్తే ఇవ్వడానికి నాకేమీ అభ్యంతరం లేదు. వాడుకూడా అదేఅంటున్నాడు.' అన్నాడు. మునసబు అతని మొగంమీద తుపుక్కున ఉమ్మి వేయాలనుకున్నాడు. ఎంతో అసహ్యించుకున్నాడు. సుబ్బయ్య ఇక అక్కడ నిలబడలేక పోయాడు. 'బాబూ...పద. ఇక నన్నా పరమాత్ముడే రక్షిస్తాడు. నా కూతురు నన్ను కాపాడుతుంది. పద బాబూ...'అన్నాడు. మునసబు, 'ఛీ మీ రింత నీచులనుకోలేదు. న్యాయానికి కట్టుబడతారనుకున్నాను.' అని ఆ వియ్యంకుడి మొగం మీదనే అని, వాళ్ళ గుమ్మందిగిపోయాడు.

ఇక సుబ్బయ్యకు మిగిలింది ఆ ఒక్క కొడుకే. తొమ్మిదేళ్ళవరకూ అష్టకష్టాలుపడి వాణ్ణి అల్లారుముద్దుగా పెంచుకొచ్చాడు. ఎప్పుడూ అతను కొడుకుతో సుగుణ సంగతి, ఆ పిల్ల అత్తవారి మర్యాద గురించి, తమకు వాళ్ళు చేసిన అవమానం గురించి చెప్తూ, 'బాబూ...నువ్వెప్పుడూ అక్కను మరచిపోకు బాబూ...అక్క నీకోసం ఎంత బాధపడి చచ్చిపోయిందనుకున్నావ్...నిన్నెప్పుడూ అక్క కాపాడుతుంది బాబూ! అక్క ఎంత చల్లని తల్లి అనుకున్నావ్...' అంటూ సుగుణ చిన్నప్పటి నుంచీ ఎట్లా బ్రతికిందీ కొడుక్కి పూసగ్రుచ్చినట్లు చెప్పి, ఆమె చనిపోయిన నాడు ఆమె పడిన బాధను వివరంగా చెప్తూ గట్టిగా ఏడ్చేవాడు. పాపం అతని మనసు ఎప్పుడూ సుగుణమీద, కొడుకు చదువుమీదా ఉండేది. రోజూ ఇవే ఆలోచించేవాడు. డబ్బుకు ఇక్కట్లు పడుతూ కూడా దమ్మిడీ అప్పుచేసేవాడు కాదు. అప్పు చేస్తే కర్మ కాలి తను చనిపోతే కొడుకు ఎక్కడ ఋణాలపాలై పోతాడో అని భయపడి పోయేవాడు. రాత్రింబగళ్ళు పాటుపడుతూ నానా అవస్థలూ పడేవాడు. రక్త బిగువు తగ్గిపోవడంతో అతను ఓరోజున మంచాన పడ్డాడు. ఆ పడటం, పడటం అంతే. మరి లేవలేదు. శివరావు నాన్నా...నాన్నా...' అంటూండగా, 'బాబూ' అక్కదేవత బాబూ...అక్కను మఱచిపోకు... అంటూ ప్రాణాలు విడిచేశాడు.

• • •

తండ్రి చావుకు బావ సూర్యనారాయణమూర్తి పూర్తిగా బాధ్యుడని అప్పటినుంచీ శివరావు ఎప్పుడూ తలపోస్తూ ఉండేవాడు. ఇక ఇప్పుడు తను కళ్ళబడటంతో అందులో తన కళ్ళ ముందే హాయిగా తిరుగుతూ తనమీద అధికారిగా ఉండటంతో అతను సహించలేక పోయాడు. 'చదువుకున్నవాడు, బాధ్యత అంటే ఏమిటో ఎరిగున్నవాడు, మంచి చెడ్డల సంగతి అర్థంచేసుకోలేనంతటి మూర్ఖుడు కానివాడు అయిన ఈ బావగారు, సిగ్గూ ఎగ్గూ లేకుండా, కనీసం, తన తల్లిదండ్రులతో న్యాయం తరఫున పోరాడక పోవడం అటుంచి, ఎవరి ఆస్తినైతే కాజేశాడో వారు... ఇంటిగుమ్మం త్రొక్కితే చూసి చూడనట్లు ఇంట్లోకి వెళ్ళిపోతాడా...ఇంత అవమానం చేస్తాడా...ఇంత నీచంగా ప్రవర్తిస్తాడా...దుర్మార్గుడు...ఇతన్ని ఏమి చేసినా పాపంలేదు. అమాయికుల పచ్చిరక్తాన్ని తాగే కిరాతకుడు...ఇక

క్కడికి పోతాడు...వీడి అణువణువూ పరితాపాగ్ని రగల్చకపోతే నేను శివరావునే కాదు... అనుకున్నాడు.

అతను అనుకున్నట్లుగానే ఓరోజున తహసీల్దారు సుబ్బారావును పిల్చి, 'పార్టు హేండ్ వచ్చిన అబ్బాయిని రేపు ఇంటికి పంపవయ్యా...'అని, నాగన్నతో టైపు మిషను ఇంటికి పంపించు...' అని క్లబ్బుకు వెళ్ళిపోయాడు. సుబ్బారావు ఈ విషయం శివరావు చెవిని వేశాడు. శివరావు, 'ఓ...తప్పక వెళ్తాను...' అన్నాడు.

ఆ రాత్రి శివరావుకు నిద్రపట్టలేదు. రేపు జాగ్రత్తగా నటించాలి. బయట పడిపోకూడదు అనుకున్నాడు.

మరునాడు తహసీల్దారుగారి ఇంటికి బయలుదేరేముందు, అక్క ఫొటో ముందు నిలబడి, 'అక్కా...నాన్నను హింసించిన బావను ఈ రోజున హింసిస్తాను. నన్ను దీవించు అక్కా...' అన్నాడు. ఆ అక్క పాపం ముభావంగా ఊరుకుంది. శివరావు లోలోపల నవ్వుకున్నాడు. 'నీకు కోపంగా ఉందా...అక్కా...' అన్నాడు. నీలాంటివాళ్ళ కలాగే ఉంటుంది అక్కా...కాని వాళ్ళు నీలాంటి వాళ్ళు కాదుగా...నీ న్యాయమైన కోర్కెలకే ఎసరుపెట్టిన దుర్మార్గులు వాళ్ళు. వాళ్ళను క్షమించే శక్తి నీకుంటే ఉంటుందేమో గాని, మాబోటివాళ్ళకు అంత సహనం ఉండటం అరుదక్కా..." అనుకుంటూ తిన్నగా బావగారింటికి బయలుదేరాడు.

శివరావును చూడగానే తహసీల్దారు,"ఏమయ్యా ఏమాత్రం స్పీడు వ్రాస్తావు?" అన్నాడు.

శివరావు మెల్లిగా చెప్పాడు.

"సరే ఒక్క నిమిషంలో వస్తాను అలా కూర్చో..." అంటూ ఆయన లోనికి వెళ్ళిపోయాడు. ఇంతలో కిటికీ రెక్కలదగ్గర కదలి వెళ్ళిన గాజుల చప్పుడయింది. శివరావు అటుతిరిగి చూశాడు. అతని కక్కడ మెల్లగా కదుల్తున్న ఆకుపచ్చ సిల్కుతెర మినహాయించి ఏమీ కనిపించలేదు. అప్పుడే శివరావు గుండెల్లో భయం తొణికిసలాడింది. 'ఒకవేళ ప్యూను నాగన్న తన గురించి ఇంతకుముందే తను ఏవూరివాడో, ఎవరి అబ్బాయో, తహసీల్దారుకు చెప్పేఉంటే...అంతా రసాభాసే అయిపోతుంది.' అనుకున్నాడు. 'అబ్బే ఇలా జరగదు...ఇలా జరగదు...తహసీల్దారుకు నా సంగతి తెలుసుకోవలసిన అగత్యం ఏముంది' అనుకొని గుండెల్ని సముదాయించుకున్నాడు.

ఒక పేడ్‌తో తహసీల్దారు వరండాలోకొచ్చి, ఈజీచైరులో కూర్చుంటూ, శివరావుతో, 'ఆ కుర్చీ ఇలా తెచ్చుకొని కూర్చోవయ్యా...' అన్నాడు. శివరావు, 'తెలిసిఉండదు' అనుకుంటూ తహసీల్దారు దగ్గరగా వచ్చి కూర్చున్నాడు. అతని మనసు పరిపరివిధాల పోయింది. వీలౌతుందా అవదా అన్న ఆదుర్దా అతనిలో హెచ్చిపోతోంది. అతనుకూడా మానవుడే కాబట్టి తప్పకుండా అడిగితీరాలి అనుకున్నాడు. ఇంతలో తహసీల్దారు కొద్దిగా కదిలిన చప్పుడైంది. అతనివైపు శివరావు తిరిగి, నోట్సు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు కూర్చున్నాడు. వెంటనే తహసీల్దారు తన పనిలో మునిగిపోయాడు. చక్కని భాష ప్రవాహంగా అతని కంఠంలోంచి ప్రవహిస్తుంటే ఆ పదజాలానికి, ఆ వాక్య విన్యాసాలకు శివరావు ముగ్ధుడైపోయాడు. కాని వెంటనే అతను 'ఇవన్నీ చూసి మురిసిపోకూడదు, ఇలాంటివాటికి లొంగిపోకూడదు.' అనుకున్నాడు. 'అయినా వీలు చిక్కుతుందో చిక్కదో' అనుకున్నాడు. చిక్కేవాటం ఏమీ కనబడటంలేదని నిరుత్సాహపడిపోయాడు. తహసీల్దారు నోట్సు చెప్పడం మానేసిన వెంటనే దాన్ని టైపుచేసి ఆయన ముందు పెట్టాడు. దానిలో ఒక్క తప్పుకూడా లేకపోవడంతో తహసీల్దారు ఎంతో ఆనందపడ్డాడు. వెంటనే, 'నువ్వీ ఆఫీసులో ఇంకెన్నాళ్ళో ఉండేట్టు కనబడటం లేదే...చాలా బాగుంది. నీకు మంచి భవిష్యత్తు ఉంది' అని, "నిన్నెక్కడో చూసినట్లుందయ్యా, ఇంతకుముందు నువ్వెక్కడ పనిచేశావు?" అన్నాడు. వెంటనే శివరావు, 'మొదటినుంచీ ఇక్కడే ఉంటున్నానండీ...' అన్నాడు. తహసీల్దారు మెల్లిగా, 'మీదీవూరేనా?' అన్నాడు. శివరావు,'హమ్మయ్య!'అనుకున్నాడు. ఇక రంగంలోకి దిగొచ్చు అనుకున్నాడు. వెంటనే మెల్లగా,ఎంతో అణకువగా 'కాదండీ!మాదీవూరుకాదు' అన్నాడు.

'ఏ వూరు?' అంటూ తహసీల్దారు శివరావును నఖశిఖపర్యంతమూ పరీక్షగా చూశాడు.

వెంటనే శివరావు, 'చిలకలపూడండి, పశ్చిమ గోదావరి జిల్లా' అన్నాడు.

ఈ మాటతో తహసీల్దారు మొఖం తమాషాగా మారింది. 'మీ నాన్నగారి పేరు...?' అన్నాడు ఏదో తెలుసుకోవాలనే ఉత్కంఠతలో.

'సుబ్బయ్యగారండి!' శివరావు జాగ్రత్తగా తహసీల్దారు భావనను పరీక్షిస్తూ చెప్పాడు.

తహసీల్దారుగారు కుర్చీలోంచి కదిలారు. వాల్చిన వదనం పైకి ఎత్తారు. శివరావు కళ్ళల్లోకి చూస్తూ, 'ఏ సుబ్బయ్యగారు?' అన్నాడు.

'వెన్నెల అండి!' శివరావు గుండెల్ని చేతిలో పట్టుకున్నాడు. ఇప్పుడే జాగ్రత్తగా ఉండాలి, తొందరపడిపోకూడదు అనుకున్నాడు.

తహసీల్దారు సూర్యనారాయణమూర్తి పూర్తిగా మారిపోయాడు. గబాలున, 'వారు బాగున్నారా?' అన్నాడు.

శివరావు అందుకున్నాడు—

'లేదండి, వారు లేరు.' అతని కంఠం పూడుకపోయినట్లు పలికింది.

'ఎప్పుడు పోయారు...?' తహసీల్దారు కంఠం వణికింది.

శివరావు మాట తప్పించాడు.

'సామాన్యమైన చావు కాదండి!'

'అంటే...?'

'వారు హత్యచేయబడ్డారండి!'

'హత్యా...! ఏమిటి వారిని హత్యచేసేవాళ్లు కూడా వున్నారా...ఎలా జరిగింది?'

శివరావు కళ్ళవెంట నీళ్లు కారుతున్నాయి.

'మా వూరివాళ్ళంతా మీ రన్నట్లుగానే అన్నారండి! ఇంత దారుణంగా చంపబడటం మేం ఎక్కడా చూడలేదన్నారండి!'

'అసలు ఆ చంపిందెవ్వరు...?' తహసీల్దారు ఆత్రుతపడ్డారు.

శివరావు మెల్లిగా చెప్పాడు: 'ఎందుకండీ... చెప్పుకుంటే సిగ్గు! అయినా ఆయన చంపబడటమే మంచిదయిందండి. లేకపోతే చేతిలో చిల్లిగవ్వ లేక కూటికీ గుడ్డకూ ఆయన ఎన్నో ఇక్కట్లుపడవలసి వచ్చేది. అప్పు చేస్తే కొడుకు అభివృద్ధికి ఎక్కడ ఆటంకం వస్తుందో అని తన రెక్కలు ముక్కలయ్యేట్టు పనిచేయవలసి వచ్చేది. ఇంటింటికీ తిరిగి వారాలు గడుపుకుంటూ చదువుకునే కొడుకును చూడలేక కుళ్ళికుళ్ళి నశించిపోవలసి వచ్చేది...' అన్నాడు.

తహసీల్దారుకు ఏమిటో అడగా లనిపించింది. కాని అడగలేకపోయాడు. అతని గుండెల్లో కల్లోలం చెలరేగింది. అయినా అణచుకున్నాడు. 'ఇంతకీ ఆ చంపిందెవ్వరో చెప్పావుకాదు...' అన్నాడు.

శివరావు తననుతాను మరచిపోయాడు. ఏమి చెపుతున్నదీ అతని వీనులకు వినిపించటం మానేసింది. 'చంద్రవంక సూర్యనారాయణమూర్తి అని ఓ రాక్షసుడు ఉన్నాడులెండి. వట్టి కిరాతకుడు. వారి అల్లుడే! కట్నంరూపేణా అన్యాయంగా మా ఆస్తి అంతా దోచుకోవడమే కాకుండా, మా నాన్నగారు వాళ్ళ ఇంటికి వెళ్తే ఎప్పుడు వచ్చారు అని అడగటానికి కూడా ఆయనగారికి నోరొచ్చింది కాదు. ఈ బాధతోనే ఆయన కుమిలి కుమిలి చచ్చిపోయాడండి. ఎప్పుడూ ఇదే బాధ, ఇవే మాటలు. మర్యాద తెలియని, సిగ్గు శరమూ లేని, చీమూ నెత్తురూ లేని మనిషి పెట్టిన కోత వారి గుండెల్ని హింసించి హింసించి చీల్చింది. అణువణువునా ఆయన ఈ అమర్యాదతో కాలిపోయాడండి. ఇదే బాధ.. ఇదే బాధ, ఆయన్ని చివరకు హత్యచేసి విడచింది. ఇలాంటి హంతకుణ్ణి శిక్షించడానికి న్యాయస్థానం ఆ హంతకుడి గుండెల్లోనే వుంటుందనేవారు నాన్నగారు. ఇది నిజమంటారా అండి?...' అంటూ ఆగిపోయాడు.

తహసీల్దారు అంతా గ్రహించాడు. శివరావు తను ఎవరో పూర్తిగా ఎరిగిఉండి మాట్లాడుతూన్న మాటలే అని అర్థంచేసుకున్నాడు. కాని అతని నోరు తెరచుకోలేదు. అతని మొఖంలో ప్రాణం ఎప్పుడో ఎగిరిపోయింది.

ఇంత తాపీగా శత్రువును చుట్టుముట్టి అతని గుండెల్లో అగ్గిపెట్టి, అది నిశ్శబ్దంగా అతనిలో మండుకపోతూ వుంటే చూడగలిగే భాగ్యం తన కొక్కడికే లభించింది అనుకుంటూ, ఇక ఉద్యోగం పోయినా బెంగలేదు అనుకుంటూ శివరావు తహసీల్దారు ఎదుట నిబ్బరంగా కూర్చున్నాడు. కాని పాపం, అతని నిబ్బరం ఎంతసేపో నిలబడలేదు. బావగారి మొఖంలోకి ఒకసారి చూడగానే అది పూర్తిగా కరిగిపోయింది. శిలాప్రతిమలా ఉన్న

తహసీల్దారు కన్నులవెంట ఎడతెగకుండా కన్నీరు కారుతోంది.

అప్పుడే ఆ లోపలి గదిలోంచి తహసీల్దారు భార్య, గబాలున బయటకొచ్చి 'తమ్ముడూ...' అంది. శివరావు ఆమెను చూడగానే ఆమె మాట వినగానే గజగజ లాడిపోయాడు. తన అక్క ప్రాణంతో ఆ ఫోటోలోంచి కదలివచ్చినట్లు ఉంది ఆమె. వెంటనే ఆవిడ, 'ఆగిపోయేవేం తమ్ముడూ మీ బావగారికి ఈ కాస్త శిక్షా సరిపోదు. నాన్న గారు ఎంత బాధపడ్డారు...అయ్యో...' అంది. ఆమె నేత్రాలలో కన్నీటి బిందువులు నిలిచాయి.

ఇంతలోనే ఆమె, మెరుపులాంటి ఆలోచన తట్టినట్లుగా గబాలున వెనుదిరిగి లోని గదిలోకి వెళ్ళి చిత్రంగా తిరిగి వచ్చింది. వస్తూ వస్తూ కళ్ళు జిగేల్ మనిపించింది. అరవిచ్చిన గులాబిమొగ్గలా ఉన్న సుకుమారిని సాగర గర్భంలోంచి ఎడతెగకుండా పుట్టుకొచ్చే నునులేత కెరటాల రెక్కల మీద తేలిపోయేసోయగాన్ని, ఆకసాన్ని చుంబించే మేలిమి జలతారు వెన్నెలల్ని అక్కడ అవతరింప జేసింది.' ఏమిటి చేస్తోందీమె' అనుకుంటూ శివరావు విస్తుపోయాడు. అప్పుడే ఆమె సూటిగా, 'నాన్న గారు పడిన బాధనంతా ఈ అమ్మాయి ద్వారా నువ్వు తీర్చుకో తమ్ముడూ... ఈ పిచ్చిదాన్ని ఏడిపించి, హింసించి, మీ బావగారి గుండెల్లో ఇంకా ఇంకా సెగలుపెట్టు. అప్పుడుకాని ఆయన గారికి నాన్నగారు పడినబాధ అర్థంకాదు.' అంది.

శివరావుకు ఏమి మాట్లాడటానికీ తోచలేదు. అతని కక్కడనుంచి గబగబా పారిపోవాలనిపించింది. కాని అప్పుడే అతని బావగారు కుర్చీలోంచి లేచి, "నువ్వు కాదనకు శివం...అప్పుడు నాన్నగారి మాట జవదాటలేని అసమర్థుడనై పోయాను. అయినా నా తప్పుకూడా లేదనలేను!" అంటూ శివరావు చేతులు పుచ్చుకున్నాడు.

శివరావు మనసులో తండ్రి తిరిగాడు. 'నాన్నా...' అనుకున్నాడు. అప్పుడే అతని కళ్ళల్లో అక్క నిలిచింది. శివరావు అప్రయత్నంగా అక్కకు మనసారా అంజలి ఘటించాడు. ★


ఉగాది

కాలపురుషుడు
క్రొత్తసంవత్సరమనే
నూతన వస్త్రాన్ని ధరించినాడు

★

మీరుకూడ యీ ఉగాదికి
"కోప్ ఫాబ్రిక్స్"
నూతన వస్త్రాలను ధరించండి.

దిఆంధ్ర హేండ్‌లూమ్ వీవర్సు కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్.

విజయవాడ.

M. N. A.